



నిన్నటినుంచీ ముసురుగానే వుంది.

ఇవ్వాళ పొద్దుటినుంచీ సన్నగా జల్లుపడుతోంది.

గుడిసెముందు చితచితగా వుంది. రిక్షావాడి బతుకులా గుడిసె లోపల నేలంతా చిత్తడి చిత్తడిగా వుంది.

సాయంత్రానికి రిక్షావాడి చేతుల్లో వెక్కిరించే నాలుగు రాళ్ళలా గుడిసె కప్పులోంచీ అక్కడా యిక్కడా వో చినుకు రాలుతోంది.

పొయ్యిలో కాలని తుమ్మ కొమ్మల్నీ; కడుపులో కాల్తున్న ఎండిపోయిన ఎముకల్నీ తిట్టుకుంటోంది గంగమ్మ.

లోకంలోని నిరక్షరాస్యతలా — గుడిసె అంతా కమ్మేసింది పొగ.

గంగమ్మ కళ్ళకీ పొగకీ నేస్తం కుదిరి ఎన్నేళ్ళయిందో తెలీదుగానీ, ఇవ్వాళ మాత్రం — గంగమ్మ పాలిట శత్రువుగా మారిపోయింది పొగ. పైగా, గెరిల్లాలా సతాయిస్తోంది.

అందుకే, గంగమ్మ కళ్ళు సన్నగా జల్లు కురుస్తున్నై.

గంజి చట్టిని పొయ్యిమీదనుంచీ దించి బయటికి వచ్చింది గంగమ్మ. చెంగుతో కళ్ళొత్తుకుంది.

ఎదురుగా — హనుమంతు.

గుడిసెముందు రావిచెట్టుకింద కూచుని, రాతి ముక్కతో తిన్నెమీద ఏదో బరుకుతున్నాడు.

జల్లు పలచబడుతోంది. వానకి తడిసిన మట్టి వింత వాసనల్ని వెదజల్లుతోంది. క్వార్టర్స్ ముందు తోటల్లోని బంతిపూల పచ్చదనం వాతావరణంలో కనిపిస్తోంది క్వార్టర్స్‌ని చుట్టేసిన కొండల అంచులమీద వింత వింత ఆకాశ చిత్రాలు కదలాడుతున్నై — హనుమంతు మనసులోని కోరికల్లా!

గంగమ్మ హనుమంతు దగ్గరగా వచ్చింది. ''ఏందిరా — ఈడనె కూకన్నావ్, మీ అయ్య సెంటర్ కాడికి రమ్మన్నాడుగా'' అంది వాడితో.

రంగయ్య రిక్షా వేసుకువెళ్తూ, హనుమంతుని సెంటర్‌కి పంపితే నూకలకి డబ్బులిస్తానని చెప్పిపోయాడు — అప్పటికి ఒకటి రెండు గిరాకీలు తగుల్తాయనే ఆశతో.

హనుమంతు తలెత్తి తల్లి మొహంకేసి చూశాడు.

గంగమ్మ చూపులు తిన్నెమీదికి మరలినై. అంతా ఏదో చెక్కినట్టుంది. అది రాతో, గీతో అర్థంకాదు ఆమెకి. ''ఏందిరా యియ్యన్నీ ?'' అడిగింది. ''ఒంట్లేస్తన్నా, నిన్న రాజా సెప్పాడు — పది దాంకా'' అన్నాడు హనుమంతు. వాడి కళ్ళల్లో గోచరిస్తున్న 'యురేకా' — పిలుపుల్ని — చదువుకోగలిగిన శక్తి గంగమ్మకు లేదు.

''నీ కియ్యాల తన్నులు తప్పవులే'' అంటూ వెనక్కివెళ్ళి గుడిసె తలుపు లాగి, దానికున్న పురికొసని గుంజకు కట్టి, మళ్ళీ చెట్టుకిందికి వచ్చింది.

''నే ఎల్తన్నా. మీ అయ్యొస్తే — సెట్టిగారింటికెల్లానని సెప్పు. మినుంవులు బాగు సెయ్యాలంట. మీ ఇద్దరూ గంజి తాగండి'' అంటూ ముందుకు సాగింది

గంగమ్మకి కొడుకుని తలుచుకుంటే సంతోషమూ కలుగుతుంది; అప్పుడప్పుడూ విచారమూ కలుగుతుంది. హనుమంతుకి పన్నెండేళ్ళు. గత రెండేళ్ళనుంచీ వాడు గంగమ్మకి సమస్యగానే తయారైనాడు. రోజూ పొద్దున లేస్తూనే 'నే బళ్ళోకెల్తానే — సదూకుంటా' అంటాడు. అప్పుడప్పుడూ 'పలక్కొని పెట్టమ్మా' అంటూ మారాం చేస్తాడు. ఎదురుగా క్వార్టర్స్‌లో పిల్లలు బూట్లూ, కొత్తబట్టలూ వేసుకుని, చేతుల్లో పెట్టెలతో రిక్షాల్లోకి ఎక్కుతూవుంటే — వాళ్ళందర్నీ కన్నార్పకుండా చూస్తూ రావి చెట్టుకింద నిలబడతాడు. ఈ దినచర్యలో కొత్త ఏమీలేదు. చూడాల్సిందీలేదు. అయినా ఆ సమయానికి ఠక్కున అక్కడికొచ్చి వాలతాడు హనుమంతు. అనుకోకుండానే అలా వచ్చి నిలబడతాడు. రిక్షాలు కదిలిపోతాయ్. పిల్లలు కేరింతలు కొడ్తూ, చేతులు వూపుతూ వుంటారు.

దుంగని రెండు చేతులతోనూ ఎత్తుకుని, కుడిభుజాన పెట్టుకుని బరువుగా అడుగులు వేస్తున్నాడు అతను.

మిగిలిన పిల్లలంతా వాణ్ణి గేలిచేస్తూ — ఏడిపిస్తూ — కుడి ఎడమలా, వెనకా ముందూ — అల్లరి చేస్తూ నడిపించుకొస్తున్నారు.

వాళ్ళంతా తనని దాటి వెళ్తుండగా ఎవర్నో అడిగేడు, 'ఏమిట్రా ఇది ?' అని. వాడు పెద్దగా నవ్వి 'బండకొయ్య' అని చెప్తూ వెళ్లిపోయాడు.

ఆ రాత్రి — నాయనమ్మ నడిగి 'బండకొయ్య' గురించిన వివరాలు తెలుసుకున్నాడు రంగయ్య. నిద్రపట్టలేదు బండకొయ్యని మోసుకొస్తున్న పిల్లవాడి కన్నీరే రంగయ్య కళ్ళముందు మెదలసాగింది.

అప్పట్నుంచీ రంగయ్యకి చదువంటే తేళ్ళూ, జెర్రులూ పాకినట్లవుతుంది 'చదువు' అనే మూడక్షరాల్నీ — ఉచ్చరించినా మహాపాపం అన్నట్టు భావించసాగేడు.

ఎవరన్నా చదువుకునే పిల్లల్ని చూసినప్పుడల్లా— వారు వధ్యశిలకు కొని పోబడుతున్న మేకపిల్లల్లా అనిపిస్తారు అతనికి.

ఊళ్ళోకి రెండు ఇంగ్లీష్ కాన్వెంట్‌లు వచ్చాయి. ఆ కాన్వెంట్లకి పిల్లల్ని తీసుకువెళ్ళడానికి చాలామంది రిక్షావాళ్ళు వాడుకల్ని కుదుర్చుకున్నారు. వాటిద్వారా నెలకొక ''ఇంత'' మొత్తం ఒక్కసారిగా చేతికొస్తుందని వారి ఆలోచన.

రంగయ్య మాత్రం ఆ పనిజోలికి పోలేదు. చదువుపట్ల అతనికున్న భావాలే దీనికి కారణం.

రంగయ్యకు ఈ ఆలోచనల్లోనే నిద్రపట్టింది.

* * *

ఉదయం బారెడు పొద్దెక్కింది.

వేపచెట్టుక్రింద కూర్చుని, అప్పటికి గంట నుంచీ గమనిస్తున్నాడు రంగయ్య.

రోడ్డుకు అవతలవైపు మూడంతస్తుల భవనం వుంది.

దానిలో ఏదో పెద్ద ఆఫీసు వుంది. ఆ ఆఫీసు దగ్గరికి పొద్దుటనుంచీ చాలా 'లాగుడుబండ్లు' వస్తున్నై. వచ్చిన కొద్దిసేపట్లోనే వచ్చినవి వచ్చినట్లే వెనక్కి వెళ్ళిపోతున్నై. కార్లూ, స్కూటర్లూ వున్న ఉద్యోగులంతా అటూ ఇటూ హడావిడిగా తిరుగుతున్నారు. బళ్ళవాళ్ళతో ఏదో

# అక్షరం

మాట్లాడటం, పెద్దగా అరవడం, కేకలేసుకోవడం— జరిగిపోతోంది.

మరో అర్థగంటకి —

బండ్లు, బళ్ళ యజమానులు—వెళ్ళిపోయారు

ఆఫీసులో నుంచి వో బాబు వచ్చాడు

'రిక్షా — వస్తావా ?' అన్నాడు రంగయ్య నుద్దేశించి.

తలకాయ ఊపి, రిక్షాతోసహా ఆఫీసు ముందుకు నడిచేడు రంగయ్య.

అతను లోపలికి నడుస్తూ, ''మా పెద్దసార్— మాట్లాడతారు — రా'' అన్నాడు. అనుసరించాడు రంగయ్య

పెద్దసార్ అడిగేరు, ''ఈ ఆఫీసులో వున్న రికార్డంతా గాంధీ చౌక్‌లో బిల్డింగ్‌కి చేర్చాలి కుర్చీలూ, టేబుల్సూ, రేక్‌లూ, బెంచీలూ — అవేవీ తియ్యక్కర్లేదు కాగితాలూ, ఫైళ్ళూ మాత్రమే అంతా — వీళ్ళు చూపిస్తారు చూసుకో కావాలంటే నువ్వింకో రిక్షా అతన్ని తెచ్చుకో. సాయంత్రంలోగా 'షిఫ్ట్' చేసేస్తేచాలు. ఒక్కడివే చేసుకున్నా నాకేం అభ్యంతరం లేదు.''

ఆయన ముఖంలో చిరాకూ, విసుగుదలా, అస్థిమితత్వం వున్నాయి. పక్కన చేరిన ఇతర ఉద్యోగులతో అన్నాడు — ''ఐ డోంట్ వాంట్ టు బి ఎక్స్‌ప్లాయిటెడ్ బై దోజ్ ఫెలోస్'' అందరివైపూ ఒకసారి చూసేడు.

ఒకరిద్దరు, ''యస్ .. యస్'' అన్నారు

''ఇతనికి ఆ రికార్డంతా చూపండి'' — పెద్దసార్ ఆజ్ఞాపించారు.

కొంతమంది కదిలేరు వాళ్ళతోపాటు రంగయ్యా కదిలేడు.

''అవసరమైతే — ఇతనికింకో నాలుగు రూపాయలు ఎక్కువ ఇవ్వండి. వీడూ ఒప్పుకోకపోతే నేనే మోస్తాను—అంతే'' చాలా దృఢంగా ఎవరితోనో చెప్తున్నాడు పెద్దసార్

రంగయ్య విన్నాడు ఇదేదో పట్టుదల బేరమనే విషయం అర్థమైందతనికి

రికార్డంతా చూసుకున్నాడు రంగయ్య. చాలా వుంది. గాంధీచౌక్ మూడు మైళ్ళుంది. ఒక్కడూ తలపడితే సాయంత్రందాకా తేలిగ్గా పడుతుంది

''ఎంత యివ్వమంటావ్ ?'' సార్ అడిగేడు

రంగయ్య నీళ్ళు నమిలేడు. ఎంత అడగాలో నిజానికి అతనికి తెలీదు

''మీ యిష్టం సార్ మీరే చెప్పండి'' అన్నాడు

ఆయనే ''సరే—నేనే చెప్తాను'' అని ''అరవై రూపాయలు తీసుకో'' అన్నాడు

రంగయ్య కళ్ళముందు ఆరు పదిరూపాయల కాగితాలు రెపరెపలాడినై

''అట్టాగే సార్'' అనేశాడు

పని చకచకా సాగింది. ఉద్యోగులంతా కాగితాల్నీ, ఫైళ్ళనీ కట్టలుకట్టి అందివ్వడం వంటి చిన్న చిన్న పనులు సహాయం చేస్తున్నారు రంగయ్యకి

మొదటి 'ట్రిప్' అయ్యేసరికే కాఫీలు వచ్చినై రంగయ్యకీ ఇప్పించారు

మధ్యాహ్నం ఒంటిగంట దాటుతోంది అప్పటికి ఆరుసార్లు గాంధీచౌక్‌కి వెళ్ళివచ్చాడు రంగయ్య.

ఉద్యోగులంతా భోజనానికి పోతూ, రంగయ్యనీ హోటల్‌కి పిలిచేరు

'ప్లేట్ మీల్స్' చేశాడు రంగయ్య బిల్లుని ఉద్యోగుల్లో ఒకాయన తీసుకుని చెల్లించాడు పెద్దసార్‌కి ఆఫీస్‌కే 'కేరియర్' వచ్చింది.

ఏడుగంటలు కావస్తోంది

పని పూర్తిగా అయిపోయింది.

రంగయ్య వూపిరి పీల్చుకున్నాడు

పెద్దసార్ రంగయ్యని లోపలికి కేకేశాడు రంగయ్య ఆయన ముందు నిలబడ్డాడు.

''అనుకున్నట్టు పని పూర్తిచేశావ్ నాకు చాలా సంతోషంగా వుంది'' ఆపి చుట్టూ చూశాడు ఉద్యోగ బృందమంతా ఆయన మాటల్ని సమర్థిస్తున్న మొహాలతో నిలబడ్డారు

ఒకాయన అన్నాడు, ''లారీ పెట్టివుంటే చాలా దండగ పడివుండేవాళ్ళం ''

''బండ్లవాళ్ళుకూడా మనల్ని తినేయాలని చూశారు — '' మరొకతను సన్నగా అన్నాడు.

''అందుకే — నేనీ 'ఇష్యూ'ని 'ప్రిస్టేజ్' క్రింద భావించాను. నిజంగానే, ఈ రిక్షా అతను ఒప్పుకుని వుండకపోతే — నేను నా స్వంత కార్లో




కొట్టించేసి వుండేవాణ్ణి. డ్రైవర్ లేడని 'హెజిటేట్' చేసేవాణ్ణికూడా కాదు.''

ఆయన మాటల్లో ఇంగ్లీష్ పదాలకి అర్థాలు తెలీలేదు రంగయ్యకి.

క్షణాల తర్వాత – ఉద్యోగుల్లో ఒకాయన – తొలిసారి రంగయ్యని పిలిచిన వ్యక్తి – పెద్దసార్‌ని ఉద్దేశించి చెప్పాడు, ''మనకివ్వాళ కాఫీ టిఫెన్లకీ, భోజనాలకీ అదీ అయిన ఖర్చంతా కలిపి 'వోచర్' తీసుకుందాం సార్.''

''యస్. యస్. అలాగే చెయ్యండి. ఐ ఎగ్రీ'' అంటూ రివాల్వింగ్ ఛైర్లో గిర్రున పక్కకి తిరిగి బల్లమీది మంచినీళ్ళ గ్లాస్ తీసుకుని గటగటా త్రాగేడు – పెద్దసార్.

''అయితే – నూటపాతిక రూపాయల నలభై పైసలకి రాస్తాను వోచర్'' అంటూ ఏదో కాగితం మీద రాయడం మొదలుపెట్టాడు మొదటి వ్యక్తి.

ఆ తర్వాత దానిమీద స్టాంపుని అతికించాడు. అది 'నోటుబిళ్ళ' అని రంగయ్యకి తెలుసు. ఆ కాగితాన్ని రంగయ్య ముందు వుంచి ''ఇక్కడ సంతకం చెయ్'' అంటూ చూపేడు.

రంగయ్య మనస్సు కలుక్కుమంది; గుండెల్లో ఎక్కడో సన్నటి బెజ్జం పడింది. ఆత్మ న్యూనతా భావం మొహాన్న దోబూచులాడింది. క్షణంసేపు ఏదో భావ సంఘర్షణకి లోనైనట్టు ఊగిపోయాడు.

— పెద్దదొర...

— నాయనమ్మ...




— నాయన...

— అయ్యవారు...

— చంద్రమౌళి...

— వెంకటచెట్టిగారి అబ్బాయి...

— అందరూ కళ్ళముందు మెదిలి అదృశ్యమైనారు.

వీళ్ళందర్నీ వెనక్కి నెట్టి – గంగమ్మ కనిపించింది. గంగమ్మ కొంగుచాటుగా బిక్కమొహం వేసుకుని 'అయ్యా, నే బడికెల్తానే' అంటున్న హనుమంతు కోరిక కనిపించింది.

రంగయ్య కళ్ళల్లో నీరు తిరిగింది.

ఆ ఉద్యోగికి సమాధానమేవీ చెప్పకుండా, టేబుల్‌మీది 'స్టాంప్ పేడ్'ని తెరిచి ఎడమచేతి బొటన్రవేలుని దానిమీద అద్ది; కాగితంమీద 'నిశానీ' వేశాడు. తలవంచుకునే డబ్బు తీసుకున్నాడు – అరవై రూపాయలు!!

అరవై రూపాయలు తీసుకుని నూటపాతిక రూపాయల నలభై పైసలకి 'నిశానీ' వేసిన రంగయ్యని చూసి అతని దోసిట్లోని మూడంత మబ్బూ ఫక్కున నవ్వింది. ఎదురుగా వేపచెట్టుకు వ్రేలాడుతున్న ''కాలం మారింది'' సినిమా పోష్టర్– ఆ నవ్వుతో శృతి కలిపింది.

ఏదో నిశ్చయానికి వచ్చినట్టు గబగబా అడుగులు వేసుకుంటూ ముందుకు సాగిపోయాడు రంగయ్య!

ఉన్నత శిఖరాలకు దారులు వేస్తున్న ఆ అడుగుల చూపు – రేపటి వెలుగువైపు!!

ఆ వెలుగు – ఇప్పుడూ ఎప్పుడూ – 'అక్షరం'!!!

★



Mod